

కార్పొరేటర్ సీఎన్ రెడ్డిని సన్మానిస్తున్న కమలానగర్ డబుల్‌బెడ్‌రూమ్ లబ్ధిదారులు

కార్పొరేటర్‌కు డబుల్‌బెడ్‌రూమ్ లబ్ధిదారుల సన్మానం

యూసుఫ్‌గూడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కమలానగర్ డబుల్‌బెడ్ రూమ్ వాసులు సోమవారం రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డిని కలిసి సన్మానించారు. తమ ఇళ్ల కోసంఎంతో కాలంగా ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగామని.. అయితే కార్పొరేటర్ కృషితో తమకు ఇళ్ల పట్టాలు అందాయని వారు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆయన్ను తన కార్యాలయంలో కలిసి ఘనంగా సత్కరించి మిఠాయిలు తినిపించారు.



జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- సర్కిల్-19 కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

పంజాగుట్ట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఇతర డిమాండ్లను నెరవేర్చాలని జీహెచ్‌ఎంసీ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి సి.మల్లేష్ డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు సోమవారం యూసుఫ్‌గూడలోని జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాలు, సీఐటీయూ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు నెలకు రూ.26 వేల రూపాయల వేతనం ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని కోరారు. పని భారాన్ని తగ్గించడంతో పాటు బయోమెట్రిక్, ఫేస్ రీడింగ్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. అనంతరం సర్కిల్-19 ఏఎంసీ బాలరాజు, శానిటరీ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టి.సాయి శేషగిరిరావు, రాపర్తి అశోక్, జె.స్వామి, భిక్షపతి, పాపారావు, సికిందర్, నగేష్, మల్లేష్, ఉప్పలయ్య, సుగుణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తిచేయండి

- జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు కార్పొరేటర్ వెంకటేష్ వినతి



జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబరిదికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

బంజారాహిల్స్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని కోరుతూ జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ సోమవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబరిదికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని ఫిలింనగర్, ఇందిరా నగర్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయన్నారు. పద్మాలయ అంబేడ్కర్‌నగర్, రోడ్డు నంబర్ 9 అంబేడ్కర్‌నగర్, సాయిబాబా దేవాలయం, పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాల్లో సీసీ రోడ్డు పనులకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదన్నారు. వెంటనే పనులు పూర్తి చేయాలని కోరగా కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

కబ్జాలపై ప్రజావాణిలో ఫిర్యాదు

డివిజన్ పరిధిలో సాగర్ సొసైటీ, నందగిరిహిల్స్‌లో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గతంలోమండల కార్యాలయం సిబ్బంది ప్రభుత్వ స్థలం అని పేర్కొంటూ సూచిక బోర్డులు ఏర్పాటు చేశారని.. ఇప్పుడు ఆ బోర్డులు కనిపించడం లేదని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

గుండెపోటుతో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మృతి

అమీర్‌పేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్పెక్టర్ అరిమిల్లి శ్రీనివాస్(56) సోమవారం తెల్లవారు జామున గుండుపోటులో మృతిచెందారు. ఆయన అమీర్‌పేటలోని సోనాబాయమ్మ ఆలయం వెనుక శ్రీ వీహార్ అపార్ట్‌మెంట్‌లో భార్య శైలశ్రీ, తల్లితో కలిసి ఉంటున్నాడు. ఉమానగర్ పోలీస్ స్టేషన్‌లో డీఐగా, రాంగోపాల్‌పేటలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా, ఐటీ సెల్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన శ్రీనివాస్ సీపీ కార్యాలయంలో అటాచ్‌గా ఉంటూ వీఆర్‌లో ఉన్నాడు. విషయం తెలుసుకున్న ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు.

బస్తీల్లో కమ్యూనిటీహాళ్లు కరువు

- ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని 75 శాతం బస్తీల్లో ఇదే పరిస్థితి
- ప్రైవేట్ ఫంక్షన్‌హాళ్లను ఆశ్రయిస్తుండటంతో స్థానికులపై అద్దెభారం
- కొన్నిచోట్ల ఉన్నా సౌకర్యాలు లేని వైనం
- నిర్మాణానికి అధికారులు చొరవ తీసుకోవాలంటున్న స్థానికులు



ఆనంద్‌నగర్ కాలనీలో కమ్యూనిటీహాల్ కోసం కేటాయించిన స్థలం

ఎర్రగడ్డ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లో కమ్యూనిటీహాళ్లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డివిజన్‌లో సుమారు 30 బస్తీలు ఉండగా.. అందులో 75 శాతం బస్తీల్లో కమ్యూనిటీహాళ్లు లేవు. కమ్యూనిటీహాళ్ల నిర్మాణం విషయంలో బస్తీ సంఘాల నాయకులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాయకులు కేవలం కమీషన్లకే ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బస్తీలు ఏర్పడి నలుగైదు దశాబ్దాలు గడుస్తున్నా ఇప్పటికీ కమ్యూనిటీహాళ్లను ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న శుభకార్యం చేసుకోవాలన్నా ప్రైవేట్ ఫంక్షన్‌హాళ్లను ఆశ్రయించాల్సి వస్తోందని.. దీంతో భారీగా అద్దెలు చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.

కమ్యూనిటీహాళ్లు లేని బస్తీలు

ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని నందానగర్, ఓల్డ్ నటరాజ్‌నగర్, ప్రభాత్‌నగర్, వడ్డెరబస్తీ, జహరా గుల్షన్ బాగ్, సారధినగర్, ఆనంద్‌నగర్, ఛత్రపతి శివాజీనగర్, ప్రేమ్‌నగర్ కుంట, న్యూ ప్రేమ్‌నగర్, సుల్తాన్‌నగర్, న్యూ సుల్తాన్‌నగర్, గౌతంపురి కాలనీ, న్యూ శాస్త్రినగర్ తదితర బస్తీలలో ఇప్పటికీ కమ్యూనిటీహాళ్లు లేవు. ప్రేమ్‌నగర్ బస్తీలో ఇటీవల స్థానిక ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చొరవతో కమ్యూనిటీహాల్ నిర్మాణం జరుగుతోంది. ఇదేవిధంగా మిగతా బస్తీల్లోనూ కమ్యూనిటీహాళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నవాటిల్లో సౌకర్యాల లేమి

రాజీవ్‌నగర్, కల్యాణ్‌నగర్, వికాస్‌పురి కాలనీ, బంజారానగర్, శాస్త్రినగర్, హేమావతినగర్, ఓల్డ్ సుల్తాన్‌నగర్, సౌత్ శంకర్‌లాల్‌నగర్, బి.శంకర్‌లాల్‌నగర్, గంగానగర్‌లలో కమ్యూనిటీహాళ్లు ఉన్నాయి. అయితే వీటిల్లో చాలావరకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి.

ఇబ్బందులు పడుతున్న డ్వాక్రా సభ్యులు

కమ్యూనిటీహాళ్లు లేకపోవడంతో డ్వాక్రా గ్రూపు మహిళలు, అంగన్‌వాడీ చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు సమావేశాల నిర్వహణ కోసం ఇతర బస్తీల్లోని కమ్యూనిటీహాళ్లను వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఉందని వారు వాపోతున్నారు. అంగన్‌వాడీ స్కూళ్ల కోసం గదులను అద్దెకు తీసుకుని నిర్వహించుకోవాల్సి వస్తుందని అంగన్‌వాడీ టీచర్లు చెబుతున్నారు. మరోవైపు ఆనంద్‌నగర్ కాలనీలోని హోం జెండా ప్రాంతంలో కొన్నేళ్ల క్రితమే స్థలాన్ని కేటాయించినప్పటికీ ఇప్పటి వరకు కమిటీహాల్ నిర్మాణానికి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు



కమ్యూనిటీహాళ్లను ఏర్పాటు చేయడంలో స్థానిక అధికారులు విఫలమవుతున్నారు. ఇతర బస్తీల్లోని వాటిని వినియోగించుకోవాలనుకుంటే ఆయా బస్తీల నాయకులు అడ్డుపడుతున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆనంద్‌నగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కేటాయించిన స్థలం ఇప్పటికీ అలానే ఉంది. అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఏమాత్రం ఫలితం ఉండటం లేదు.

- ఎస్ఎస్‌కే పేగడ ఆకాష్, ఆనంద్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి



బస్తీలలో కమ్యూనిటీహాళ్లు లేకపోవడంతో సమావేశాలు, శుభకార్యాలు నిర్వహించుకోవడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బి శంకర్‌లాల్‌నగర్‌లో ఇటీవల కమ్యూనిటీహాల్‌ను కొంతమేర అభివృద్ధి చేశారు కానీ మిగతా బస్తీలలో సమస్య అలానే ఉంది. కమ్యూనిటీహాళ్ల నిర్మాణానికి స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి.

- రామ్మోహన్, బి.శంకర్‌లాల్‌నగర్

వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

- గాయత్రీనగర్ ప్రజలకు ఎమ్మెల్యే తలసాని భరోసా



అధికారులతో కలిసి గాయత్రీనగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గాయత్రీనగర్ ప్రజలు ఎదుర్కొంటున్న వరద ముంపు సమస్యను పరిష్కరిస్తామని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. సోమవారం అమీర్‌పేట డివిజన్‌లోని గాయత్రీనగర్‌లో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో కాలనీలోని నాలా పొంగిపోయి ముంపునకు గురవుతున్న నేపథ్యంలో గతంలో మంత్రి హోదాలో ఈ ప్రాంతంలో పర్యటించి సమస్య శాశ్వత పరిష్కారం కోసం రూ.1.50 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ నిధులతో 95 మీటర్ల మేర బాక్స్ డ్రెయిన్ నిర్మాణం కోసం పనులు ప్రారంభించగా 45 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. మిగతా పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ పనులు పూర్తయితే ఎన్నో సంవత్సరాలుగా ఉన్న ముంపు సమస్య నుంచి కాలనీ ప్రజలకు శాశ్వత విముక్తి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ వెంకటనారాయణ, డీఈ సందీప్, ఏఈ అమీర్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సయ్యద్, ఎలక్ట్రికల్ ఏఈ మౌనిక, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి సంతోష్, కరుణాకర్‌రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, గోపలాల్ చౌహాన్, గులాబ్ సింగ్, కట్టా బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో చెత్త తరలింపు

గాయత్రీనగర్‌లో డ్రైనేజీ పనుల పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్యే తలసానికి చెత్తకుప్ప కనిపించడంతో వెంటనే తొలగించాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. కాలనీలో పారిశుధ్య నిర్వాహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు చెత్తకుప్పను వెంటనే తొలగించారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ది పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయ్ భాస్కర్ రెడ్డి తదితరులు

21 నుంచి కడ్తాల్‌లో 'పత్రీజీ ధ్యాన మహా యాగం-3'

పంజాగుట్ట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విశ్వశాంతిని కాంక్షిస్తూ ఈ నెల 21 నుంచి 31 వరకు కడ్తాల్‌లోని మహేశ్వర మహా పిరమిడ్ క్షేత్రం కైలాసపురిలో పత్రీజీ ధ్యాన మహా యాగం-3 కార్యక్రమం నిర్వహిస్తున్నామని ది పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయ్ భాస్కర్ రెడ్డి తెలిపారు. ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకుని 11 రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వశాంతికి, సకల ప్రాణికోటి రక్షణకై పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీని పత్రీజీ స్థాపించారన్నారు. ధ్యానానికి సంగీతాన్ని జోడించిన పత్రీజీ ప్రపంచ వ్యాప్తంగా ధ్యాన ప్రచారం చేశారని వెల్లడించారు. కడ్తాల్ మహేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న కార్యక్రమానికి దేశ, విదేశాల నుంచి 10 లక్షల మంది పాల్గొంటారని తెలిపారు. ప్రముఖ ఆధ్యాత్మిక గురువులు జగదీష్ బాబా, జ్ఞాన వత్సల స్వామి, ఎర్రాప్రగడ రామకృష్ణ, కమలేష్ డి.పటేల్, శ్రీధర్ స్వామి, నిత్య విద్యానంద భారతి, బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి, మదన్ గుప్తా తదితరులతో గురు సమ్మేళనం ఉంటుందన్నారు.

అధికారులపై దాడులను అరికట్టాలి

- ప్రభుత్వానికి ఉద్యోగ సంఘాల జేఏసీ నేతల విజ్ఞప్తి



మాట్లాడుతున్న జేఏసీ అధ్యక్షుడు మారం జగదీష్

పంజాగుట్ట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ అధికారులపై భౌతికదాడులను అరికట్టాలని, దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీష్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ నాయకులతో కలిసి వారు మాట్లాడారు. అబ్దుల్లాపూర్ మెట్ మండలం జాఫర్‌గూడలో ఓ ప్రైవేట్ కళాశాల యాజమాన్యం చెరువు బఫర్ జోన్‌లో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని పరిశీలించేందుకు వెళ్లిన నీటిపారుదల శాఖ ఏఈఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్, లష్కర్, రెవెన్యూ సిబ్బందిపై దాడి చేశారన్నారు. ఇంజనీర్, సిబ్బంది చిత్రీకరించిన వీడియోను డిలీట్ చేసి వారిని బెదిరించారన్నారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని.. లేనిపక్షంలో తమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. కళాశాల యాజమాన్యం వద్ద ఆధారాలు ఉంటే ఉన్నతాధికారులకు చూపించాలని, చట్టపరంగా న్యాయం కోసం పోరాడాలి తప్ప ప్రభుత్వ అధికారులపై దాడులు చేయడం ఏంటని వారు ప్రశ్నించారు. ఈ ఘటనను సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ముజీబ్, టైగర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నూనె శ్రీధర్, ఉపాధ్యక్షులు వి.ప్రకాశ్, కార్యదర్శి టీవీ ప్రసాద్, హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఏఎస్ఎన్ రెడ్డి, కార్యదర్శి చక్రధర్, ఏటీ ఏఈఈ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బండి శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

మాయమాటలు చెప్పి డబ్బులు వసూలు చేసిన మహిళపై కేసు

బంజారాహిల్స్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తన ఇంటి యజమాని కుమార్తెకు మెడికల్ సీటు వచ్చిందని, తన కుమారుడికి ఇంజనీరింగ్ సీటు వచ్చిందని, తన భర్త ఫ్యాక్టరీ పెడుతున్నాడని.. ఇలా పలువురిని నమ్మించి డబ్బులు తీసుకొని మోసం చేసిన మహిళపై పోలీసులు కేసు నమోదు చేశారు. అమరావతికి చెందిన కొడాలి శ్రీలక్ష్మి తన భర్త సత్యప్రసాద్‌తో కలిసి వెంకటేశ్వరనగర్ బస్తీలో ఉంటోంది. బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో పనిచేసే శ్రీలక్ష్మి అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు బస్తీలోని మహిళలతో సన్నిహితంగా ఉంటుంది. వారికి వివిధ కారణాలు చెప్పి అధిక వడ్డీ ఇప్పిస్తానంటూ మహిళల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేసింది. అయితే ఇటీవల అనుమానం వచ్చి బాధితులు నిలదీయడంతో కొంతమందికి చెక్కులు ఇచ్చింది. అనంతరం 15 రోజుల క్రితం ఇంటికి తాళం వేసి ఉడాయించింది. ఆమె ఇచ్చిన చెక్కులు బౌన్స్ కావడంతో సుమారు 20 మంది బాధితులు సోమవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొడాలి శ్రీలక్ష్మి, ఆమె భర్త సత్యప్రసాద్‌తో పాటు ఆమెకు సహకరించిన పద్మ తదితరులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కల్లుగీత వృత్తిపై దాడులు చేస్తున్నారు

- గౌడ సంఘాల నాయకులు



సమావేశంలో అభివాదం చేస్తున్న గౌడ సంఘాల నాయకులు

పంజాగుట్ట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చినప్పటి నుంచి కల్లుగీత వృత్తిపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పలు గౌడ సంఘాల నాయకులు ఆరోపించారు. గౌడ సామాజిక వర్గానికి ఇచ్చిన ఒక్క హామీని కూడా రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. తెలంగాణ గౌడ కలుగీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్ అధ్యక్షతన సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'ఏడాది కాంగ్రెస్ పాలన-కల్లుగీత వృత్తిపై దాడి' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎక్సైజ్ శాఖ మంత్రిగా జూపల్లి కృష్ణారావును తప్పించాలని, కల్లుగీత వృత్తిని బీసీ శాఖలో కలపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 48 గంటల్లో ప్రభుత్వం స్పందించకపోతే ఇందిరాపార్కు వద్ద వేలాదిమందితో మహాధర్నా చేపడతామని వారు హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో గౌడ వృత్తికి అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటే అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ తమ వృత్తిని దెబ్బతీసేలా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఇప్పటి వరకు గౌడ సంఘాలు, కల్లుగీత వృత్తిదారులతో మంత్రి జూపల్లి ఒక్క సమావేశం సైతం ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్ గౌడ్, తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు ఎంవీ రమణ,గౌడ జన హక్కుల పోరాట సమితి అధ్యక్షులు యెలికట్టే విజయకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

- సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం నేత హుస్సేనప్ప

పంజాగుట్ట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాఠశాల విద్యాభివృద్ధి కోసం సమగ్ర శిక్షలో వివిధ స్థాయిలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, నియామకాలలో వెయిటేజ్ కల్పించాలని తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు డి.హుస్సేనప్ప డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళా విభాగం అధ్యక్షురాలు ఎస్‌పీ ప్రణీత, శ్రీదేవి, సమి, ఆసియా బేగం తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షలోని అన్ని విభాగాలలో 18 సంవత్సరాల నుంచి సుమారు 19,600 మందికి పైగా కాంట్రాక్ట్ ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం తమకు అన్యాయం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం తమను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రణీత, అల్తాఫ్, సుధాకర్, అమరవాణి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో బస్తీబాట

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం వివిధ జిల్లాల నుంచి వచ్చినవారే బస్తీల్లో అధికంగా ఉన్నారని, వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందడం లేదని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బస్తీబాట కార్యక్రమంలో భాగంగా బంజారాహిల్స్‌లోని గౌరీశంకర్ నగర్‌లో పర్యటించారు. అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని, పేద బీసీలు ఆత్మగౌరవంతో బతికేలా బ్యాంకు సబ్సిడీలు అందేలా చూడాలన్నారు. బస్తీలో సమస్యలను పరిష్కరించేలా స్థానిక డిప్యూటీ కమిషనర్ ప్రశాంతితో కలిసి చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి గ్రేటర్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు బండారి పద్మావతి, రాష్ట్ర మహిళా కార్యదర్శి నాగమణి, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ మడత కిషోర్, యూత్ సెక్రెటరీ ఊరుగొండ శివ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ భారత మురళీధర్, శ్రీలత, రాధిక, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



పడిపూజలో పాల్గొన్న సుశీల గురుస్వామి, ఎస్.గోపి గురుస్వామి తదితరులు

ఘనంగా అయ్యప్ప పడిపూజ

ఎర్రగడ్డ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ బి.శంకర్‌లాల్ నగర్‌లో గురుస్వామి ఎస్.గోపి ఆధ్వర్యంలో సోమవారం పడిపూజ నిర్వహించారు. ముందుగా గణపతి హోమం నిర్వహించి అనంతరం అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గురుస్వామి గోపి మాట్లాడుతూ.. ప్రతి ఏడాది అయ్యప్ప పడిపూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టాస్క్‌ల పేరుతో రూ.4.49 లక్షలు కాజేశారు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టి పనిచేస్తే ఎక్కువ ఆదాయం వస్తుందని నమ్మించిన సైబర్ నేరగాళ్లు మహిళ నుంచి రూ.4.49 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన మహిళ (40) పార్ట్‌టైం జాబ్‌కోసం ప్రయత్నిస్తుడగా గుర్తుతెలియని వ్యక్తులు తాము పింపిన లింక్‌లు ఒపెన్ చేసి రేటింగ్‌లు ఇస్తే డబ్బులు ఇస్తామన్నారు. టాస్క్ పూర్తి చేసిన ఆమె ఖాతాలో రూ.130 జమ చేశారు. మరో టాస్క్ ఇచ్చి పూర్తిచేసిన తర్వాత రూ.300 పంపారు. ఇలా పలు దఫాలుగా చేసి నమ్మకం వచ్చిన తర్వాత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెడితే మంచి లాభాలు వస్తాయని నమ్మించారు. దీంతో ఆమె పలు దఫాలుగా రూ.4.49 లక్షలు చెల్లించింది. ఈ డబ్బు ఇవ్వాలంటే మరికొంత డబ్బు డిపాజిట్ చేయాలని చెప్పడంతో బాధితురాలు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మ్యాట్రిమోని సైట్‌లో నకిలీ ఐడీతో రూ.2 లక్షల టోకరా

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మ్యాట్రిమోని సైట్‌లో మహిళ పేరుతో నకిలీ ఐడీని సృష్టించిన సైబర్ నేరగాళ్లు యువకుడి నుంచి రూ.2.05 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి (35) పెళ్లి సంబంధాల కోసం ఓ మ్యాట్రిమోనిలో రిజిస్టర్ చేసుకున్నాడు. ఓ యువతి ప్రొఫైల్ నచ్చడంతో వాట్సాప్ నంబర్ తీసుకున్నాడు. సదరు యువతి తనది విశాఖపట్నమని, మలేషియాలో బాబాయి వద్ద ఉంటున్నానని చెప్పింది. తెలుగు బాగా మాట్లాడటం, వైజాగ్‌లో వివిధ ప్రాంతాల గురించి చెప్పడంతో అతడికి నమ్మకం కుదిరింది. పెళ్లి చేసుకునేందుకు ఒకే చెప్పి క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెట్టాలని ఒత్తిడి చేసింది. తన బాబాయికి క్రిప్టో ట్రేడింగ్‌లో అనుభవం ఉందని, ఆయన సలహాలు తీసుకోవాలని సూచించింది. మహిళ పంపిన లింక్ ద్వారా ఆక్స్‌నేట్ పేరుతో ఉన్న యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. తర్వాత చిన్న మొత్తాల్లో పెట్టుబడులు పెట్టించిన సైబర్ నేరగాళ్లు యాప్‌లో లాభాలు వచ్చినట్లు చూపారు. పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టాలని మహిళ సూచించడంతో బ్యాంకులో రుణం తీసుకొని మరీ వారు చెప్పిన ఖాతాలకు డబ్బు పంపాడు. యాప్‌లో లాభాలు వచ్చినట్లు చూపినా విత్‌డ్రా ఆప్షన్ లేకపోవడం, మహిళ ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయాని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సెలబ్రిటీలను మోసం చేసిన కాంతిదత్‌కు బెయిల్



కాంతిదత్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): త్రితియ గోల్డ్ జువెల్లరీ ట్రేడింగ్ పేరుతో వ్యాపారాన్ని ప్రారంభించి సెలబ్రిటీలతో పెట్టుబడులు పెట్టించి మోసం చేసిన కేసులో కాంతిదత్‌కు బెయిల్ మంజూరైంది. దీంతో అతను సోమవారం జైలు నుంచి విడుదలయ్యాడు. విశాఖకు చెందిన కాంతిదత్ వ్యాపారం చేసి డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌కు వచ్చాడు. ఈ క్రమంలో ముందుగా సస్టెయిన్ కార్ట్ పేరుతో కంపెనీ ఏర్పాటు చేసి ప్రారంభోత్సవానికి ఒక ఫ్యాషన్ డిజైనర్ సహకారంతో సినీ సెలబ్రిటీలను తీసుకొచ్చాడు. ఇలా సెలబ్రిటీలతో పరిచయాలు పెంచుకుని తన కంపెనీల్లో పెట్టుడులు పెడితే తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించాడు. దీంతో రూ.కోట్లలో పెట్టుబడులు పెట్టారు. కొద్దిరోజుల తర్వాత సస్టెయిన్ కార్ట్ కంపెనీ మూసేసి త్రితియ జువెల్లరీ గోల్డ్ ట్రేడింగ్ వ్యాపారాన్ని ప్రారంభించాడు. ఇలా పలువురిని నమ్మించి రూ.100 కోట్లకు పైగా కొల్లగొట్టాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇటీవల నిందితుడిని అరెస్ట్ చేశారు.



రక్షణశాఖ సహాయమంత్రి సంజయ్‌సేథ్ చేతులమీదుగా రక్షామంత్రి అవార్డును అందుకుంటున్న కంటోన్మెంట్‌బోర్డు సీఈఓ మధుకర్‌నాయక్

కంటోన్మెంట్ బోర్డుకు రక్షామంత్రి అవార్డు

సికింద్రాబాద్, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు స్వచ్ఛ చావనీ-2024 ఎక్సలెన్స్ ఏ కేటగిరి విభాగంలో ప్రతిష్ఠాత్మక కేంద్ర రక్షామంత్రి అవార్డును ఆ బోర్డు అధికారులకు ప్రదానం చేశారు. డిఫెన్స్ ఎస్టేట్ డే సందర్భంగా సోమవారం న్యూఢిల్లీలో చాణక్య ఆడిటోరియంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్రరక్షణశాఖ సహాయమంత్రి సంజయ్‌సేథ్ రక్షా మంత్రి అవార్డును కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్‌నాయక్, నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ, హెల్త్ సూపరింటెండెంట్ దేవేందర్, శానిటేషన్ సూపర్ వైజర్ ఆకులమహేందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో రక్షణశాఖ డైరెక్టర్ జనరల్ రాజేశ్వరణ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



రూ.1.5 లక్షలను బాధితుడికి అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

బస్సులో పోగొట్టుకున్న నగదు దొరికింది

మారేడుపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ, పోలీసు సిబ్బంది చాకచక్యంతో వ్యవహరించి బస్సులో మర్చిపోయిన బ్యాగును స్వాధీనం చేసుకుని అందులో ఉన్న లక్షా 50 వేల రూపాయల నగదును బాధితుడికి అందజేసిన సంఘటన జూబ్లీ బస్టాండ్‌లో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. జనగాం బస్ డిపోకు చెందిన బస్సు సిటీవైపు వస్తుండగా అందులో వి.రాజేష్ అనే విద్యార్థి తన బ్యాగుతో కలిసి బస్సులో ప్రయాణం చేస్తూ ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద బ్యాగు బస్సులో మరిచి దిగిపోయాడు. ఈ విషయాన్ని వెంటనే రాజేష్ ఆర్టీసీ సిబ్బందికి, అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆర్టీసీ విభాగంలో ఎస్సైగా పనిచేస్తున్న లక్ష్మణ్ స్పందించి టిక్కెట్ ఆధారంగా ఆ బస్సు డ్రైవర్ వివరాలను సేకరించి డ్రైవర్‌కు మొబైల్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో అప్రమత్తమైన ఆర్టీసీ సిబ్బంది ఆ బస్సులో సోదా చేయగా బ్యాగు దొరికింది. దాంతో బాధితుడి వివరాల ప్రకారం నగదుతో పాటు ఇతర డాక్యుమెంట్స్ ఉన్న విషయం గుర్తించి తమ వద్ద సేఫ్టీగా ఉందని తెలిపారు. జూబ్లీ బస్టాండ్‌లోని స్టేషన్ మేనేజర్ అక్బర్ వద్దకు బాధితుడు రాగా ఎస్సై సమక్షంలో బ్యాగును అందజేశారు.



వారాసిగూడలో డ్రైనేజీ ఓవర్ ఫ్లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు

బౌద్ధనగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లో వారాసిగూడ ప్రధాన రహదారిపై పారుతున్న డ్రైనేజీ ఓవర్ ఫ్లో పనులను సోమవారం స్థానిక డివిజన్ కార్పొరేటర్ సామల హేమ, జలమండలి మేనేజర్ కుషాల్ పరిశీలించారు. ప్రధానరహదారిపై డ్రైనేజీ నీరు పారుతుందని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేయటంతో అధికారులతో కలిసి పర్యటించారు. సిబ్బందితో మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేయించారు.



బోయిన్‌పల్లి న్యూసిటీకాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలలో పాల్గొన్న భక్తులు

ధనుర్మాస ఉత్సవాలకు వేళాయె

బోయిన్‌పల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లిలో ప్రసిద్ధిగాంచిన న్యూసిటీ కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం తెల్లవారుజాము నుంచి ధనుర్మాసం ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు పవన్‌కుమార్ స్వామి, దీపక్ స్వామి, శ్రీధర్ స్వామిలు అమ్మవార్లకు ప్రత్యేక అలంకారంచేసి ధనుర్మాసం ఉత్సవాలను వేదమంత్రాలతో భక్తుల నామస్మరణల మధ్య నిర్వహించారు. చలిని కూడా లెక్కచేయకుండా మహిళలు వృద్ధులు ప్రత్యేక పూజలను తిలకించి భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. అనంతరం తిరుమల పల్లెర్ల మూడి సువర్ణతో గావించిన తిరుప్పావై ప్రవచనాలు చదివారు. మంగళవారం తెల్లవారు జామునుండి పాశురాలలో వ్రత విధానం తిరుప్పావై ప్రవచనాలు పూర్తిస్థాయిలో ప్రారంభమవుతాయని, చలికాలం కావడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.



ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారు



మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో టీడీపీ నాయకులు గౌరిశంకర్ యాదవ్, రమేష్ బాబు, అవిత, పరమేశ్వరి, రెజీనా ,శీలం రాణి, లిల్లీ, షీలా తదితరులు పాల్గొన్నారు.

- (రెజిమెంటల్‌బజార్, ఆంధ్రజ్యోతి)

నీటి వృథా.. ఎవరిది బాధ్యత?

- కోట్లాది రూపాయలు ఖర్చవుతున్నా లీకేజీలను పట్టించుకోని అధికారులు
- పొదుపుపై ప్రతి పౌరుడికీ జాగ్రత్త అవసరమే



ప్యారడైజ్ వద్ద రోడ్డుపై వృథాగా ప్రవహిస్తున్న నీరు

రాంగోపాల్‌పేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జంటనగరాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు నలభై ఏళ్ల క్రితం వరకు ప్రభుత్వం ప్రతి రోజు రెండు పూటల రెండేసి గంటల సేపు.. ముప్పై ఏళ్ల క్రితం ప్రతి రోజు రెండు గంటల సేపు.. గత ఇరవై ఏళ్ల నుండి రెండు రోజులకు ఒకసారి.. కొన్ని ప్రాంతాలలో వారానికి రెండు రోజులు మంచినీటిని సరఫరా చేసేది. నగర ప్రజల దాహార్తిని తీర్చడానికి ప్రభుత్వం వందల కిలోమీటర్ల దూరం నుంచి నీటిని తెప్పిస్తోంది. దానికోసం ఎంతో ప్రయాసతో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. అలాంటి నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉంది.



నల్లగుట్టలో వృథా అవుతున్న మంచి నీరు

వాటర్ వర్క్స్ డివిజన్ 7 నల్లగుట్ట సెక్షన్ పరిధిలో పరిధిలో 1 మిలియన్ గ్యాలెన్స్ శుద్ధిచేసిన మంచినీటిని సరఫరా చేస్తోంది. కానీ దానిలో దాదాపు 20 శాతం నీరు వృథా అవుతుంది. చుట్టాల బస్తీ, నల్లగుట్ట, సీలైన్, జే లైన్, ఎఫ్ లైన్, కాచీ బౌలీ, చుట్టాల బస్తీ, వెంగళరావు నగర్, కలాసీగూడ, ధన్‌బజార్, ఇందిరానగర్ తదితర బస్తీలలో ప్రభుత్వం సరఫరా చేసే మంచినీటిని ప్రజలు ట్యాప్ వస్తున్న సమయంలో డైరెక్టుగా బట్టలు ఉతకడానికి, కార్లు, ద్విచక్ర వాహనాలు కడగడానికి, వాకిళ్లు శుభ్రపరచడానికి పైపులద్వారా వాడుతున్నారు. ఇప్పటికైనా ప్రజలు, అధికారులు జాగ్రత్త వహించక ఇదే పరిస్థితి కొనసాగితే మరి కొన్నేళ్లలో నెలకు ఒకసారి మంచినీరు సరఫరా చేసే పరిస్థితి వస్తుంది.

స్వచ్ఛంద సంస్థల అవగాహన

జీహెచ్‌ఎంసీ, జలమండలిలతో కలిసి స్వచ్ఛంద సంస్థలు, మహిళా బృందాలు మంచి నీరు వృథా కాకుండా ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కరపత్రాలు, వీధి నాటకాలతో ఎన్నో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రజలు నీటిని ఓ విధంగా వృథా చేస్తుంటే, అధికారులు ఎప్పటికప్పుడు పైపులైన్లు, వాల్వుల మెయింటనెన్స్ పట్టించుకోక లీకేజీల ద్వారా వృథా చేస్తున్నారు.

పొదుపుగా నీటిని వాడాలి



ప్రజలు ప్రభుత్వం పంపిణీ చేసే మంచినీటిని అనవసరంగా వాడకుండా వృథా చేయకుండా పొదుపుగా వాడాలి. నల్లా వచ్చే సమయంలో మంచి నీటిని డ్రమ్ములు, బిందెలలో భద్రపరచుకుని వాడుకోవాలి అంతేకాని పైపులు పెట్టి వీధులను శుభ్రపరచడం, బట్టలు ఉతకడం వంటి చర్యలకు పాల్పడకుండా ఉంటేనే భవిష్యత్తుకు నీటి కొరత ఉండదు.

- రమేష్, నల్లగుట్ట సెక్షన్ మేనేజర్

రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్‌లో జీవన్ ప్రమాణ్ సర్టిఫికెట్
- 64 శాతం మెడికల్ కార్డుల పంపిణీ





సమావేశంలో ప్రసంగిస్తున్న దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, పాల్గొన్న ప్రతినిధులు

చిలకలగూడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో పదవీ విరమణ చేసిన వారికి అన్ని చర్యలు చేపడుతున్నామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తెలిపారు. సికింద్రాబాద్, రైల్ నిలయంలో సోమవారం పెన్షన్ అదాలత్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ.. జోన్ పరిధిలో 1,24,000 మంది పెన్షనర్లు ఉన్నారని, 64 శాతం మెడికల్ కార్డులు (యుఎంఐడీ) అందజేశామని అన్నారు. పాస్ ఆన్‌లైన్‌లో తీసుకోవచ్చని ఇంటి వద్ద నుండే రిజర్వేషన్ చేసుకోవచ్చని, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సేవలు వినియోగించుకోవడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మెరుగైన వైద్య సేవలు, నోషన్ ఇంక్రిమెంట్, పదవీ విరమణ చేసే నాటికి రికార్డులను పరిశీలించి ఎటువంటి బకాయిలు రికవరీ చేయకుండా, పదవీ విరమణ రోజు వాటిని అందించి పెన్షన్‌పత్రాలు ఇస్తున్నామని వివరించారు.

ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వయిజర్ అకౌంట్స్ వివేకానంద మాట్లాడుతూ.. ఇంటి వద్ద నుండే జీవన్ ప్రమాణ్ ఆన్‌లైన్‌లో అందజేయడానికి విస్తృత ప్రచారం కల్పించడం వల్ల విదేశాల్లో ఉన్నా సకాలంలో అందజేశారని, నవంబర్ చివరి వరకు 151 మంది స్వచ్ఛంద పదవీ విరమణ చేశారని తెలిపారు. వివిధ కారణాల వల్ల పదవీ విరమణ చేసిన వారిని కలుపుకుని రూ.62.42 కోట్లు చెల్లించామని, 2028వ సంవత్సరం లోపు పదవీ విరమణ చేసే ఉద్యోగులు సర్వీస్ రిజిస్టర్‌లను పరిశీలించి పెన్షన్ అందజేయడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి మరణిస్తే అర్హులకు పెన్షన్ అందించడంలో జరుగుతున్న జాప్యం నివారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ద.మ. రైల్వే ఏజీఎం. నీరజ్ అగర్వాల్, ప్రిన్సిపల్ చీఫ్‌పర్సనల్ ఆఫీసర్ జీపీ ఎస్. రావు, ప్రిన్సిపల్ మెడికల్ డైరెక్టర్ నిర్మల, ఆల్ ఇండియా రైల్వే ఆఫీసర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ద.మ.రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య, అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు రామకృష్ణా చార్యులు, అధ్యక్షుడు సత్యనారాయణ, పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ: బక్కని



నరసింహులుని శాలువతో సత్కరిస్తున్న కార్యకర్తలు

చిలకలగూడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తుందని పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు అన్నారు. మెట్టుగూడ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించి మాట్లాడుతూ, రాష్ట్రంలోని 119 నియోజక వర్గాల్లో సభ్యత్వ నమోదు ప్రక్రియ జోరుగా సాగుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించటానికి కార్యకర్తలు కృషిచేయాలని, కార్యకర్తల ప్రమాద బీమా రూ.2 లక్షల నుండి రూ.5 లక్షలకి పెంచారని, ఎన్‌టీఆర్ ట్రస్ట్ ద్వారా నిరుపేదలకు ఉచితవిద్య అందజేస్తున్నట్లు తెలిపారు.

నరసింహులుని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు తడక వినోద్‌కుమార్, నరసింగ రావు, రాపోలు సురేష్ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు ఆదరణ :నర్సింగ్

మారేడుపల్లి, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్‌లో తెలుగుదేశం పార్టీకి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందని మల్కాజిగిరి పార్లమెంట్ కమిటీ సభ్యుడు జనగాం నర్సింగ్ రావు అన్నారు.

సోమవారం కంటోన్మెంట్ బోర్డు ఐదో వార్డు పరిధిలోని వాల్మీకి సమాజ్, సెకండ్ లక్ష్మీనగర్‌లో కమిటీ సభ్యులు మధుసూదన్ రావు, అనురాధ, కే.ప్రతాప్ అధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటోన్మెంట్‌లో ప్రతి వార్డులో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.



టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న అడ్‌హక్ కమిటీ సభ్యులు జె.నర్సింగ్‌రావు, మధుసూధన్ రావు, అనురాధ, ప్రతాప్

వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం: తలసాని

అమీర్‌పేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గాయత్రినగర్ ప్రజలు ఎదుర్కొంటున్న వరద ముంపు సమస్యను పరిష్కరిస్తామని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. సోమవారం అమీర్‌పేట డివిజన్‌లోని గాయత్రినగర్‌లో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో కాలనీలోని నాలా పొంగిపోయి ముంపునకు గురవుతున్న నేపథ్యంలో గతంలో మంత్రి హోదాలో ఈ ప్రాంతంలో పర్యటించి సమస్య శాశ్వత పరిష్కారం కోసం రూ.1.50 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ నిధులతో 95 మీటర్ల మేర బాక్స్ డ్రైన్ నిర్మాణం కోసం పనులు ప్రారంభించగా 45 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. మిగతా పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ పనులు పూర్తయితే ఎన్నో సంవత్సరాలుగా ఉన్న ముంపు సమస్య నుంచి కాలనీ ప్రజలకు శాశ్వత విముక్తి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ వెంకటనారాయణ, డీఈ సందీప్, ఏఈ అమీర్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సయ్యద్, ఎలక్ట్రికల్ ఏఈ మౌనిక, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి సంతోష్, కరుణాకర్‌రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, గోపలాల్ చౌహాన్, గులాబ్ సింగ్, కట్టా బలరాం తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో కలిసి గాయత్రినగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని

ఎమ్మెల్యే ఆదేశాలతో చెత్త తరలింపు

గాయత్రీనగర్‌లో డ్రైనేజీ పనుల పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్యే తలసానికి చెత్తకుప్ప కనిపించడంతో వెంటనే తొలగించాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. కాలనీలో పారిశుధ్య నిర్వాహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు చెత్తకుప్పను వెంటనే తొలగించారు.



అలుగడ్డబావి ప్రధానరహదారిపై నిలిచిపోయిన వాహనాలు

సికింద్రాబాద్ అలుగడ్డబావి జంక్షన్‌లో పెట్రోల్, డీజిల్ లోడుతో వెళ్తున్న ట్యాంకర్ బోల్తా పడడంతో రైల్ నిలయం, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మెట్టుగూడ, తార్నాక, చిలకలగూడ వైపు నుండి రాకపోకలు సాగించే వాహనదారులు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నార్త్ జోన్ డీసీపీ రష్మీపెరుమాల్, ఏసీపీ సుబ్బయ్య, ఇనిస్పెక్టర్లు, జీహెచ్‌ఎంసీ, ఫైర్, డీఆర్‌ఎఫ్ సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు.



సంఘటన స్థలంలో డీసీపీ రష్మీ పెరుమాళ్



మెట్టుగూడ అయ్యప్ప ఆలయంలో లక్ష పుష్పార్చన గావిస్తున్న భక్తులు

అయ్యప్పకు లక్ష పుష్పార్చన

చిలకలగూడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ అయ్యప్ప ఆలయంలో స్వామికి భక్తి శ్రద్ధలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు. స్వామి నామ స్మరణ మార్మోగుతుండగా చేమంతి పూలతో అర్చన చేశారు. అయ్యప్ప స్వామి భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ ప్రతినిధి సునీల్ పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.



స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆదం విజయ్‌కుమార్

అన్నదానం

బౌద్ధనగర్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి దత్తాత్రేయస్వామి ఆలయంలో సోమవారం మాల ధరించిన అయ్యప్పస్వాములకు అన్నదాన కార్యక్రమం ప్రారంభమైంది. నిర్వాహకుడు సమ్మెట వెంకటేశ్వరరావు(కిరణ్) ఆధ్వర్యంలో జనవరి 14వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. మాజీ కార్పొరేటర్ ఆదం విజయ్‌కుమార్ స్వామి ఆలయ అవరణలో స్వాములకు అన్నదానం ప్రారంభించారు.



చంద్రమౌళేశ్వరి ఆలయ నూతన కమిటీ

చంద్రమౌళేశ్వరీ దేవాలయ నూతన కమిటీ ఎన్నిక

తిరుమలగిరి డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్ బజార్ లోని శ్రీ రాజ రాజేశ్వరి చంద్రమౌళేశ్వరం స్వామి దేవాలయం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులు పవన్ యాదవ్, ఉపాధ్యక్షులు డి.రవీందర్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వేణుగోపాల్, సహాయ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏఆర్ శ్రీధర్, కోశాధికారి అనిల్ యాదవ్, జాయింట్ సెక్రటరీ రమేష్, చీఫ్ అడ్వైజర్ విద్యాసాగర్ బాల్‌రాజ్, ముఖేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, వినోద్, శ్రీధర్ క్రిష్ణ యాదవ్, రాజ్ కుమార్, మురళీధర్‌ను ఎన్నుకున్నారు.

సెలబ్రిటీలను మోసం చేసిన కాంతీదత్‌కు బెయిల్

- గోల్డ్ ట్రేడింగ్ పేరుతో రూ.100 కోట్లకు పైగా వసూలు



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): త్రితియ గోల్డ్ జువెల్లరీ ట్రేడింగ్ పేరుతో వ్యాపారాన్ని ప్రారంభించి సెలబ్రిటీలతో పెట్టుబడులు పెట్టించి మోసం చేసిన కేసులో కాంతిదత్‌కు బెయిల్ మంజూరైంది. దీంతో అతను సోమవారం జైలు నుంచి విడుదలయ్యాడు. విశాఖకు చెందిన కాంతిదత్ వ్యాపారం చేసి డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌కు వచ్చాడు. ఈ క్రమంలో ముందుగా సస్టెయిన్ కార్ట్ పేరుతో కంపెనీ ఏర్పాటు చేసి ప్రారంభోత్సవానికి ఒక ఫ్యాషన్ డిజైనర్ సహకారంతో సినీ సెలబ్రిటీలను తీసుకొచ్చాడు. ఇలా సెలబ్రిటీలతో పరిచయాలు పెంచుకుని తన కంపెనీల్లో పెట్టుడులు పెడితే తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించాడు. దీంతో వారు రూ.కోట్లలో పెట్టుబడులు పెట్టారు. కొద్ది రోజుల తర్వాత సస్టెయిన్ కార్ట్ కంపెనీ మూసేసి త్రితియ జువెల్లరీ గోల్డ్ ట్రేడింగ్ వ్యాపారాన్ని ప్రారంభించాడు. ఇలా పలువురిని నమ్మించి రూ.100 కోట్లకు పైగా కొల్లగొట్టి మోసం చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి సీసీఎస్‌కు అప్పగించగా ఇటీవల నిందితుడిని అరెస్ట్ చేశారు.

గుండెపోటుతో ఇన్‌స్పెక్టర్ మృతి

అమీర్‌పేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్పెక్టర్ అరిమిల్లి శ్రీనివాస్(56) సోమవారం తెల్లవారు జామున గుండుపోటులో మృతిచెందారు. ఆయన అమీర్‌పేటలోని సోనాబాయమ్మ ఆలయం వెనుక శ్రీ వీహార్ అపార్ట్‌మెంట్‌లో భార్య శైలశ్రీ, తల్లితో కలిసి ఉంటున్నాడు. ఉమానగర్ పోలీస్ స్టేషన్‌లో డీఐగా, రాంగోపాల్‌పేటలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా, ఐటీ సెల్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన శ్రీనివాస్ సీపీ కార్యాలయంలో అటాచ్‌గా ఉంటూ వీఆర్‌లో ఉన్నాడు. ఎస్‌ఆర్‌నగర్ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ నివాళులర్పించారు.